పల్లెలకు రాని ఆర్టీసీ వెలుగు

- బస్సులు రాక నడక యాతన
- కె.కోట మండలంలోని ఆరు గ్రామాల్లో ఇబ్బందులు

కామవరపు కోట: పక్కా రహదారులు ఉన్నా కొన్ని గ్రామాలకు రవాణా సదుపాయం లేదు. ప్రధానంగా ఆర్టీసీ సర్వీసులు లేవు. కొన్నేళ్లుగా బస్సు రాక ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. లేదంటే నడక యాతన తప్పడంలేదు. కామవరపుకోట మండలం అంకలంపాడు, జలపవారిగూడెం, కేఎస్ రామవరం, కళ్లచెరువు, సాగిపాడు గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు. ఈ గ్రామాలకు గత 25 ఏళ్ల క్రితం రెండు బస్సు నడిచేవని, జంగారెడ్డిగూడెం వయా కామవరపుకోట, జలపవారిగూడెం, కళ్లచెరువు గ్రామం మీదుగా లింగపాలెం మండలం కలుపుతూ నూజివీడు వరకు తిప్పేవారు. ప్రస్తుతం బస్సు సర్వీసులు లేక ప్రజలు 15 కిలో మీటర్ల వరకు పెళ్లి తడికలపూడి మీదుగా అటు ఏలూరు, ఇటు కామవరపుకోటకు నిత్యం విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ప్రజలు వెళ్లి వస్తూ ఉంటారు.



కామవరపుకోటలో ఆర్టీసీ బస్టాండ్

రెండు కిలో మీటర్లు నడకే!

కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి గత పదేళ్లుగా రవాణా సౌకర్యం లేదు. గతంలో ఏలూరు నుంచి ద్వారకాతిరుమల, రామన్నగూడెం, దేవినేనివారిగూడెం, వయా తడికలపూడి, వీరిశెట్టిగూడెం బస్ సర్వీసు నడిపేవారు. ఆ సర్వీసులు నిలిపివేయడంతో కామవరపుకోట, జంగారెడ్డిగూడెం పట్టణానికి, అటు ఏలూరు పట్టణానికి వెళ్లాలన్నా ప్రజలు రెండు కిలో మీటర్లు అడ్డ రోడ్డు వరకు కాలి నడకన వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా గ్రామాలకు బస్ సర్వీసులు పునరుద్ధరించాలని, పండించిన నిమ్మకాయ బస్తాలు తరలించేందుకు కూడా తడికలపూడిలో ఆర్టీసీ కార్గో పాయింట్ ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కార్గో పాయింట్స్ ఏర్పాటు చేయాలి



రైతులు పండించిన పంట మార్కెట్‌కు తరలించేందుకు, చదువుల నిమిత్తం విద్యార్థులు నిత్యం పట్టణ ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. సరైన రవాణా సౌకర్యం లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆర్టీసీ సర్వీస్‌లు నడపాలి. కార్గో పాయింటు ఏర్పాటు చేయాలి.

– నౌడు అప్పారావు, రైతు, కళ్లచెరువు గ్రామం

బస్ సర్వీసులు నడపాలి



విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారులు, రైతులు నిత్యం ఏలూరు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట వెళ్లి వస్తూ ఉంటారు. సరైన రవాణా సౌకర్యం లేక వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మా గ్రామాలకు బస్ సర్వీసులు నడపాలి.

– గంగు ప్రసాద్ రెడ్డి, జలపవారిగూడెం గ్రామస్తుడు, కామవరపుకోట మండలం

నిత్యం రెండు కిలో మీటర్లు నడవాలి



మా గ్రామస్తులు ఏలూరు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట తదితర ప్రాంతాలకు వెళ్లాలన్న రెండు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి బస్సు ఎక్కాలి. పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలు వెళ్లాలన్నా రవాణా సౌకర్యం లేదు. అధికారులు చొరవ తీసుకుని బస్ సర్వీసులు నడపాలి.

– దాసి భూషణం, గ్రామస్తుడు, వీరిశెట్టి వారి గూడెం

క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.2.01 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న హయగ్రీవాచార్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,01,116 విరాళం అందజేశారు. ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురానికి చెందిన పోలిన సత్యనారాయణ రూ.1,01,116, తణుకుకు చెందిన సత్తి ధనలక్ష్మి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

పశువులకు టీకాలు ప్రారంభం



పశువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

కొయ్యలగూడెం: పశువులకు నిర్వహించే టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ అన్నారు. పరింపూడి పశు వైద్యశాల వద్ద ప్రధాన పశువైద్య శాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి, కాలి గిట్టలు, నోటి వ్యాధులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 31 వరకు అన్ని పశు వైద్యశాలల్లో టీకా కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



కామవరపుకోటలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ రజవుల్లా

కామవరపుకోట: తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్యం నిర్వహణలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని డీఎల్‌పీఓ రజవుల్లా ప్రజలకు సూచించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా శనివారం మండలంలోని రావికంపాడు, ఉప్పలపాడు, కామవరపుకోట గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నుంచి తయారయిన ఎరువుని సేంద్రీయ ఎరువుగా వాడుకోవచ్చని, ఈ ఎరువు పర్యావరణానికి మేలని వివరించారు. ఎంపీడీఓ ముళ్లగిరి సరళకుమారి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడి విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కామవరపుకోట: జిల్లా స్థాయి ఆటల పోటీలకు తడికలపూడి విద్యార్థులు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆటల పోటీల్లో తమ విద్యార్థులు అథ్లెటిక్స్ డిస్కస్ త్రోలో పంతగాని అనిల్, కబడ్డీ పోటీల్లో రాజశేఖర్, అనిల్, శివ సాయి, మాధవరావు, మణికంత, డేవిడ్ రాజు, కృష్ణ సాయి, బాలాజీ విశేష ప్రతిభ కనబరిచి రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. వీరిని జెడ్పీటీసీ కడిమి రమేష్, విద్యా కమిటీ చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎరువుల షాపులపై దాడులు



పి.అంకంపాలెంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలంలో పలు ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. పి.అంకంపాలెంలో వెంకటేశ్వర, లక్ష్మీ నివాస ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందులు అక్రమ నిల్వ ఉన్నట్టు గుర్తించామని, విలువ సుమారు రూ.8,93,850 ఉంటుందని విజిలెన్స్ ఏఓ వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి ఏఓ కె.గంగాధరం, వీఆర్‌ఓ అశోక్, ఎంపీఈఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై తేనెటీగల దాడి



చికిత్స పొందుతున్న వ్యక్తి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు 902 కొండ ప్రాంతంలో నలుగురిపై తేనెటీగలు దాడి చేశాయి. శనివారం విధులకు వెళుతున్న నలుగురు కార్మికులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. సహచరులు వెంటనే గుర్తించి పోలవరం వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు వీరికి చికిత్స అందించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు.

ఇసుక తిన్నెలపై చెత్త తొలగింపు



ఇసుక తిన్నెలపై చెత్తను తొలగిస్తున్న కార్మికులు

పోలవరం రూరల్: పట్టిసం ఇసుక తిన్నెలపై పేరుకు పోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించే పనులు చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా వచ్చిన భక్తులు ఇసుక తిన్నెలపై పారవేసిన చెత్తను శుభ్రం చేస్తున్నారు. చెత్తను పోగు చేసి గోతులు తీసి వాటిలో ఖననం చేస్తున్నారు. ఇసుక తిన్నెలపై ఉన్న మొత్తం చెత్తను తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి టి.విజయ కుమారి తెలిపారు.

మాదిగ అమరవీరులకు జోహార్లు



జోహార్లర్పిస్తున్న మాదిగలు

ద్వారకాతిరుమల: స్థానిక వైష్ణవి హోటల్‌లో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు వృథాకాదని అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంకిపాటి గాంధి, సభ్యుడు మద్దాల వెంకటేశ్వరరావు, జూనిపూడి సిద్ధయ్య, కంకిపాటి భాను, మత్రి మధు, డొక్కా దుర్గారావు, నల్లంటి రామారావు, కంకిపాటి తాతారావు, దిర్శిపాం రాజేష్, డొక్కా దుర్గారావు, డొక్కా దావీదు, బ్రహ్మయ్య, పెండెల నాగరాజు తదితరులున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జంగారెడ్డిగూడెంలో పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు



చింతలపూడి : పరీక్షా రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

55 మంది గైర్హాజరు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చింతలపూడి : ఇంటర్ మొదటి సంవత్సరం తొలి రోజు శనివారం తెలుగు, సంస్కృత పరీక్షలు నిర్వహించారు. చింతలపూడిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 756 మంది హాజరయ్యారు. 55 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 235 మందికి 205 మంది, అర్పణ జూనియర్ కళాశాలలో 289 మందికి 278 మంది, హయగ్రీవ కళాశాలలో 232 మందికి 218 మంది హాజరయ్యారు.

పోలవరంలో 82 మంది హాజరు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఫస్ట్ ఇయర్ తొలి రోజు పరీక్షలకు 82 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె.సజిని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు.

స్కూల్ గ్రేడ్ తగ్గింపుపై నిరసన



ఎంపీయూపీ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు ఎంపీయూపీ స్కూల్‌ను ఎంపీపీ స్కూల్‌గా చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్కూల్ వద్ద గ్రామస్తులు శనివారం ధర్నా చేశారు. తమ స్కూల్ ఇప్పటికే హైస్కూల్ స్థాయికి చేరాల్సి ఉన్నప్పటికీ మరింత దిగువ స్థాయికి చేర్చుతూ ప్రభుత్వం ప్రకటన చేయడం అన్యాయమని ఆరోపించారు. వంద మందికి పైగా విద్యార్థులు ఎనిమిదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. దిప్పకాయలపాడు సహా సమీపంలోని పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లగూడెం, కిచ్చప్పగూడెం, దళితవాడ నుంచి విద్యార్థులు దాదాపు ఐదు కిలో మీటర్ల దూరం నుంచి వస్తున్నారని వివరించారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను కన్నాపురం హైస్కూల్లో విలీనం చేస్తున్నట్లుగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడం అన్యాయమని తెలిపారు. కేవలం క్రీడా ప్రాంగణం లేకపోవడాన్ని సాకుగా చూపుతూ విద్యార్థుల భవితవ్యాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీ గ్రేడ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు రైతు నాయకులు కాకర్ల నంది, కాకర్ల శేషు, జి.రామ్మోహన్‌రావు, డి.బాబీ, గద్దె బాబు తదితరులు మద్దతు తెలిపారు.

ముగిసిన శివయ్య బ్రహ్మోత్సవాలు



ద్వారకాతిరుమల : పుష్ప యాగోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కొయ్యలగూడెం : రసలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన విశేష కార్యక్రమాలతో శివయ్య బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు విశేష అభిషేకాలు చేశారు. అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి అర్చకులు వేద మంత్రోచ్చరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల నడుమ ద్వాదశ కోవెల ప్రదక్షిణలను అట్టహాసంగా జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్ప యాగోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

కన్నాపురంలో అన్నాభిషేకం

కొయ్యలగూడెం: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం కన్నాపురం శివాలయంలో దుర్గా భవాని అన్నపూర్ణ సమేత రసలింగేశ్వర స్వామికి విశేష పూజలతోపాటు అన్నాభిషేకం నిర్వహించారు. శివుడికి అన్నాభిషేకం అత్యంత ప్రీతికరమైనదని అర్చకులు మణికంత శర్మ తెలిపారు. ఈ అన్నప్రసాదాన్ని రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో చల్లుకోవడం వల్ల పంటలు సుభిక్షంగా పండుతాయని వివరించారు. భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆశ్రంకు ఉచిత బస్సు సేవలు ప్రారంభం



జంగారెడ్డిగూడెంలో ఉచిత బస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత బస్సు సేవలను శనివారం ప్రారంభించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రముఖ వైద్యుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాకర్ల రామచంద్రబాబు, క్షత్రియ సేవా సమితి ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్ సంబూరి రామచంద్రరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి శనివారం ఉదయం 7.30 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి ప్రారంభమై, గురువాయిగూడెం, దేవులపల్లి, బొర్రంపాలెం అడ్డురోడ్డు, ఆడమల్లి, కామవరపుకోట, తడికెలపూడి, వేగివాడ, మొండూరు, చక్రాయిగూడెం, నాగన్నగూడెం, గాలాయిగూడెం, గోపన్నపాలెం సోమవరప్పాడు మీదుగా ఆశ్రం హాస్పిటల్‌కు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం బయలుదేరి జంగారెడ్డిగూడెం చేరుకుంటుందన్నారు. బస్సు సౌకర్యాన్ని వినియోగించుకొని చక్కని వైద్య సేవలు పొందాలని ప్రజలకు సూచించారు. ఆశ్రం సీఓఓ ఎస్ రాజరాజన్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నిలిచిపోయిన బస్సు సర్వీసును ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు ఆదేశాల మేరకు పునరుద్ధరించామని చెప్పారు. ఆశ్రం ద్వారా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ వైద్య సేవలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు పెనుమత్స రంగరాజు, కోశాధికారి గుట్టుముక్కల భాస్కరరాజు, ఇందుకూరి వెంకట సుబ్బరాజు, హాస్పిటల్ మేనేజర్ జమాల్ పాషా, పీఆర్‌ఓ ప్రసాద్, దుర్గా ప్రసాద్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన సాయిదుర్గకు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన కొడమంచిలి జాన్‌రత్నంతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహ సమయంలో రూ.5 లక్షల కట్నం, 1 కాసు బంగారం ఉంగరం, మూడున్నర కాసుల చైన్, రూ.4 లక్షలు విలువైన సారె సామగ్రి, 2సెంట్ల ఇటి స్థలం కట్నంగా ఇచ్చారు. అధిక కట్నం తీసుకోసం సాయిదుర్గను భర్త జాన్ రత్నం ఫిబ్రవరి 25న కొట్టి గాయపర్చాడు. దీంతో సాయిదుర్గ తమ్ముడు సువర్ణరాజు వచ్చి ఆమెను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. ఈ ఘటనపై పెద్దల్లో పెట్టినప్పటికీ జాన్‌రత్నం తీరు మారకపోవడంతో శనివారం సాయిదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హెచ్‌ఎం సస్పెన్షన్‌పై యూటీఎఫ్ ఖండన

జంగారెడ్డిగూడెం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెడ్డిపేట, లక్కవరం ప్రధానోపాధ్యాయులు బి.సుబ్రహ్మణ్యంను ముందుగా బదిలీ చేసి, ఆ తర్వాత కొందరి ఒత్తిడి మేరకు సస్పెండ్ చేయటాన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. వెంటనే సస్పెన్షన్ రద్దు చేసి వేరే గ్రామంలో సుబ్రహ్మణ్యానికి పోస్టింగ్ ఇవ్వాలేదని పేర్కొంది. యూటీఎఫ్ జంగారెడ్డిగూడెం మండలం కోర్ కమిటీ సమావేశం శనివారం స్థానిక యూటీఎఫ్ భవనంలో తడాహికో అధ్యక్షతన నిర్వహించారు. మండల ఇన్‌చార్జి జిల్లా గౌరవ అధ్యక్షుడు యంవీ శ్యాంబాబు పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు.